జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
మంగళవారం | 21 | జులై | 2026 ◆ పేజీలు : 6



# పేద విద్యార్థుల ఉన్నత చదువులకు స్ఫూర్తి అండ

**తల్లిదండ్రుల కలలను నిజం చేయండి**
**ఫౌండేషన్ చైర్మన్ శ్రీ వ్యాల్**



**కల్లూరు, జూలై 20 : ప్రజాజ్యోతి** పేద విద్యార్థుల ఉన్నత విద్యకు అండగా నిలుస్తున్న స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ ఉయ్యూరి శ్రీ వ్యాల్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ప్రతి కుటుంబం

మిగతా 2 లో...

- ఖమ్మంలో మరిన్ని అగ్రో ఆధారిత పరిశ్రమలకు ప్రభుత్వం ప్రోత్సాహం
- విలువ ఆధారిత వ్యవసాయంతో రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలి
- కొణిజెర్లను పారిశ్రామిక మండలంగా తీర్చిదిద్దుతాం
- రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు 10 లక్షల ఎకరాలకు విస్తరణే లక్ష్యం
- దేశంలో తొలి సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్
- ప్రతి 10 వేల ఎకరాలకు ఒక ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు లక్ష్యం
- సీడ్ గార్డెన్‌తో దేశానికే ఖమ్మం కేంద్రంగా మారుతుంది
- గోద్రెజ్ సమీకృత (ఇంటిగ్రేటెడ్) ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని ప్రారంభించిన డిప్యూటీ సీఎం



## వ్యవసాయానికి పరిశ్రమల తోడ్పాటుతోనే
# రైతుల ఆదాయం పెరుగుతుంది

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** వ్యవసాయాన్ని పరిశ్రమలతో అనుసంధానం చేసి విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించినప్పుడే రైతుల ఆదాయం స్థిరంగా పెరుగుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం అంజనాపురంలో తెలంగాణ ప్రభుత్వ సహకారంతో నిర్మించిన గోద్రెజ్ సమీకృత (ఇంటిగ్రేటెడ్) ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మల్లు, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్‌పర్సన్ నాదిర్ బి. గోద్రెజ్, గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్ కటారియా,వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, సిపి సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి సోమవారం ఘనంగా ప్రారంభించారు.అనంతరం ఫ్యాక్టరీలోని ఉత్పత్తి విభాగాలు, ఆయిల్ పామ్ గెలల ప్రాసెసింగ్ యూనిట్లు, నాణ్యత నియంత్రణ వ్యవస్థను పరిశీలించి సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం శ్రీ భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వ్యవసాయానికి చిరునామాగా నిలిచిందన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకప్పుడు హెవీ వాటర్ ప్లాంట్, థర్మల్ పవర్ స్టేషన్, నవభారత్ వంటి పరిశ్రమలు ఉండేవని, జిల్లా పునర్విభజన తర్వాత ప్రస్తుతం ఖమ్మం జిల్లా ప్రధానంగా వ్యవసాయంపైనే

మిగతా 6 లో...

# క్షేత్రస్థాయి వాస్తవాల ఆధారంగానే ఎల్‌నినో ను ఎదుర్కోవాలి

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు




- అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ చేపట్టాలి
- గతేడాది–ఈ ఏడాది నీటి లభ్యతపై నివేదిక విడుదల చేయాలి
- నాగార్జునసాగర్, పాలేరు నుంచి ఈ ఖరీఫ్‌లో సాగు నీరు లేదు
- త్రాగునీటి అవసరాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలి
- రైతు వేదికల ద్వారా వాస్తవ పరిస్థితులను వివరించాలి
- బోర్ల ఆధారంగా నీటి అధిక అవసరమున్న పంటలు వేయొద్దు
- రాజీవ్ లింక్ కాలువ ద్వారా నీటి తరలింపుపై వెంటనే నివేదిక ఇవ్వాలి

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను శాస్త్రీయ అంచనాలు, క్షేత్రస్థాయి వాస్తవాలు, శాఖల సమన్వయంతోనే సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.సోమవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మల్లు,రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల

మిగతా 2 లో...

# మాకు న్యాయం చేయండి

**పోలీస్ లను వేడుకున్న బాధితురాలు**



**నేలకొండపల్లి, జులై 20 ప్రజా జ్యోతి:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మంగాపురం తండా శివారులో ఉన్నటువంటి రేగుల గడ్డ తండ గ్రామము పరిధిలో ధీరావతు పుష్పావతి సోమవారం పోలీస్ స్టేషన్ లో పోలీస్ లను వేడుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... తమ పొలం పక్కన ఉన్నటువంటి రైతు దాదాపుగా రెండు కుంటల భూమిని అక్రమంగా ఆక్రమించుకున్నారని సంగతి తెలిసిందే. గత దశాబ్ద కాలంగా జరుగుతున్న గొడవ కు ఇరువురి అంగీకారంతో డిజిటల్ సర్వే చేయగా పక్క రైతు పొలంలో దాదాపు రెండు కుంట్ల వరకు భూమి ఎక్కువ ఉన్నది.అదేవిధంగా మా పొలములో అనగా ధీరావతు పుష్పావతి అయిన నేను బాధితురాలుగా పూర్తి ఆధారాలతో జులై 8వ తారీఖున నేను కొండపల్లి ఎస్సై కు ఫిర్యాదు చేయడం జరిగినది. అప్పటి ఎస్ ఐ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత మేము పిలిపించి మాట్లాడు తాము మర్యాదగా రాజీకి వస్తే ఒకే కాగితాల ప్రకారంగా ఉండాల్సిన పొలం అతనికి ఇచ్చి అదీకంగా ఉన్నటువంటి దాదాపు రెండు కుంటల భూమి మీకు ఇప్పిస్తాం అన్నారు. ఒక వేళ వారు ఒప్పుకోకపోతే ఎఫ్ ఐ ఆర్ చేసి కోర్టు కు

మిగతా 2 లో...

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయండి

**ఎంఈ ఓ బి మురళీమోహన్**



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలో చొప్పకట్లపాలెం ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులను గ్రామ సర్పంచ్ బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల విద్యాశాఖాధికారి మురళీ మోహన్ మాట్లాడుతూ అంగన్వాడీలో నాలుగు సంవత్సరాలు పూర్తయిన విద్యార్థులు నేరుగా ప్రీ ప్రైమరీ తరగతుల్లో జాయిన్ చేయాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం విద్య పైన ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని తెలిపారు. ప్రీ ప్రైమరీ తరగతులకు ఒక ఇన్స్ట్రక్టర్ ఒక ఆయా ప్రభుత్వం నియమించింది. వారికి అన్ని అవకాశాలు పాఠశాలలో కల్పిస్తారని ప్రభుత్వం అందించే సదుపాయాలను తల్లిదండ్రులను ఉపయోగించుకోవాలి. ఈ సందర్భంగా తెలియజేశారు. ఎక్కువమంది విద్యార్థులను ప్రీ ప్రైమరీ తరగతుల్లో జాయిన్ చేయాలని ఆయన కోరినారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్యానందం, వార్డు సభ్యులు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అన్నపూర్ణ పాఠశాల ఉపాధ్యాయులు త్రివేణి, మధు, వరలక్ష్మి, కమల, శ్రీలత గ్రామ పెద్దలు సుబ్బారావు, బాబురావు, శ్రీనివాస్ రెడ్డి, ప్రసన్న విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల ఉన్నత చదువులకు స్ఫూర్తి అండ

(మొదటి పేజీ తరువాయి...)

స్వయంగా తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించే స్థాయికి చేరుకొని స్వచ్ఛంద సంస్థల అవసరమే లేకుండా సమాజ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కల్లూరు లోని విజ్ఞాన్ స్కూల్ లో ఆదివారం స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిదండ్రుల సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రుల పరిస్థితులు ఎలా ఉన్నా తమ పిల్లల భవిష్యత్తు కోసం చదువుకే ప్రాధాన్యం ఇచ్చి జీవితాంతం కష్టపడుతున్నారని వారి త్యాగాన్ని ఎన్నటికీ తీర్చలేమన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని వమ్ము చేయకుండా బాగా చదివి మంచి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులను గౌరవంగా చూసుకోవడమే స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థకు ఇచ్చే గొప్ప కానుక అని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థల నిజమైన లక్ష్యం సమాజంలో మార్పు తీసుకు రావడమేనని, మరో పది నుంచి 15 సంవత్సరాల తర్వాత ఎలాంటి సహాయం అవసరం లేకుండా సమాజం ఎదగాలనే సంకల్పంతో స్వచ్ఛంద సంస్థ పనిచేస్తుందని తెలిపారు. ప్రస్తుత సహాయం పొందుతున్న విద్యార్థులు భవిష్యత్తులో స్థిరపడి తమలాగే మరికొందరి నిరుపేద విద్యార్థులకు చేయూతనివ్వాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థల అవసరం లేకుండా ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడాలని కోరుకున్నట్లు తెలిపారు. కల్లూరు ఏఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ, కల్లూరు మండలానికి చెందిన సుమారు 65 మంది నిరుపేద విద్యార్థులకు బీటెక్, ఎంబిబిఎస్, బి ఎస్సీ నర్సింగ్, తదితర ఉన్నత చదువులకు స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని అభినందనీయమన్నారు. నిరుపేద తల్లిదండ్రులకు ఆపద్బాంధవుడిగా ఈ సంస్థ నిలుస్తుందని కొనియాడారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ బాటలో విద్యార్థులు ఉన్నత స్థాయిలో లక్ష్యాలను చేరుకోవాలని అందరికీ ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ మహబూబాబాద్ జిల్లా ఉద్యాన శాఖ అధికారి జినుగు మరియన్న, జయశంకర్ భూపాలపల్లి జిల్లా డిపిఆర్ఓ శీలం శ్రీనివాసరావు, విజ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ ఎస్ కే ఇస్మాయిల్, కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, రిటైర్డ్ లెక్చరర్ ఉబ్బన నాగరాజు, స్ఫూర్తి ఫౌండేషన్ కమిటీ సభ్యులు ఉబ్బన బాబురావు, జల్ది రామకృష్ణ, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, చింతలపూడి కృష్ణ, ఉబ్బన వేణుబాబు, ఎస్కే ముజీమ్, మర్రెలు వెంకటేశ్వరరావు, ఇందూరి దేవేందర్, దామాల దయాకర్, లబ్ధిదారులైన విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మాకు న్యాయం చేయండి

(మొదటి పేజీ తరువాయి...)

పంపిస్తాం అన్నారు.. కానీ నేటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. మేము ఇట్టి విషయమై మీకు ముట్టినట్టు మాకు రషీద్ ఇమ్మనగా ఇవ్వలేదు, స్స్ ద్వారా మీకు సమాచారం ఇస్తాము అనగానే మేము ఇంటికి వచ్చేసాము అన్నారు. హైదరాబాద్ లో గల డీజీపీ కార్యాలయం నుండి మాకు ఫోన్ చేసి మా ఫిర్యాదు వివరాలు అడిగారు మాకు న్యాయం జరిగిందా అని అడిగారు మరియు పోలీస్ స్టేషన్లో మీతో ఎలా ప్రవర్తించారు అని అడిగారు మేము అన్నిటికి సమాధానం చెప్పాము. మీ సమస్య పరిష్కారం కాకపోవటానికి కారణం కూడా అడిగారు కాకపోతే మేము అప్పటి ఎస్సె ట్రాన్స్ఫర్ అయ్యారు కొత్త ఎస్ఐ వచ్చారన్నారు. మీరు ఒకసారి వెళ్ళండి ఏమి జరిగిందో మాకు చెప్పండి అన్నారు అదే విధంగా మేము నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ కి సందర్శించి మా ఫిర్యాదు పై ఏం యాక్సన్ తీసుకున్నారూ అని అడగగా...సావు కబురు చల్లగా చెప్పినట్టు మీ కంప్లెంట్ క్లోజ్ చేసాము అని చెప్పి అక్కడ ఉన్నటువంటి రిసెప్షన్ లిస్టులు ఇద్దరూ మాట్లాడటం జరిగింది, మేము ఫిర్యాదు చేశాము మాకు తెలియకుండా మా కంప్లెంట్ ని ఎట్లా క్లోజ్ చేశారు అని అడగగా వారి నుండి సమాధానం లేదు, లేకపోక ఎదురు దాడి చేసి భయపెట్టడం ఫ్రెండ్లీ పోలీస్ ఎక్కడ అని అయోమయంలో మేము సందిగ్ధంలో పడ్డామున్నారు. చివరగా ఎస్ఐ కు ఫోన్ చేసి అడగక ఎస్ఐ సానుకూలంగా విన్నారు వారికి క్లియర్ గా చెప్పడం జరిగింది. పొలములో దాదాపు రెండు కుంటల భూమి ఎక్కువ ఉన్నట్లు డిజిటల్ సర్వే ఆధారాలు మరియు పూర్తి ఆధారాలు కూడా సమర్పించి ఉన్నాం సార్ అని చెప్పాము ఎక్కువ ఉన్న భూమిని మాభూమి మాకు ఇప్పించ మని కోరగా సార్ అవసరమైతే కేస్ ను రీ ఓపెన్ చేస్తాను అని చెప్పడం జరిగింది, కేవలం SI గారి స్పందన ఆధారంగా దాదాపు ఇంకొక వారం రోజులు ఓపికతో ఉంటాము, ఒకవేళ మా సమస్య పరిష్కారం కానీ ఎడల తర్వాత మేము తీసుకునే చర్యలు రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లడం జరుగుతుందని ఇందు మూలంగా తెలియజేస్తున్నాం. ఈరోజు మాకు కొద్దిగా ఉపశమనం కేవలం ఇప్పుడు ఉన్నటువంటి ఎస్ఐ ద్వారానే కలిగినది కానీ అక్కడున్న సిబ్బంది దురుసుతనము మరియు వారి ప్రవర్తనపై మేము చాలా మనోవేదనకు మరియు తీవ్ర మనస్థాపానికి గురి అయ్యామని ఈ విధంగా అందరికీ తెలియజేస్తున్నాము, భవిష్యత్తులో మాలాగా ఎవరు ఇబ్బంది పడకుండా ఉండాలని అందుకు పోలీసు శాఖ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. స్నేహపూర్వక పోలీస్ కు నిదర్శనముగా కేవలం SI గారు ఒక్కరే కాదు కింది స్థాయి సిబ్బందిలలో పూర్తి పరివర్తన రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మేము సీనియర్ సిటిజనుగా భావిస్తున్నాము

# క్షేత్రస్థాయి వాస్తవాల ఆధారంగానే ఎల్‌నినోను ఎదుర్కోవాలి

(మొదటి పేజీ తరువాయి...)

నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు లతో కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎల్‌నినో పరిస్థితులు, వర్ష పాతం, త్రాగునీటి లభ్యత, సాగునీటి పరిస్థితి, భూగర్భ జలాలు, విద్యుత్ సరఫరా, పంటల ప్రణాళికలపై సంబంధిత శాఖల అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పెద్దపల్లి జిల్లాకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్ ఎల్‌నినో పరిస్థితులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. జూలై 15 నాటికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 35 శాతం వర్షపాతం లోటు నమోదైందని, రైతులు ప్రస్తుతం పత్తి అధికంగా సాగు చేశారని, వర్షాలు వస్తే వరి పంట వేద్దామని చూస్తున్నారని, భూగర్భ జలాలు గలవారు వరి పంట సాగుకు ముందుకు వెళ్తున్నారని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ భూగర్భ జలాలు వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రాబోయే రెండు నెలల్లో మరింత తగ్గిపోతాయని, రైతులు ఎవరు వరి పంట సాగు చేయవద్దని ఆయన కోరారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకే జిల్లాల్లో సమీక్షా సమావేశాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటి పారుదల, ప్రణాళిక, వ్యవసాయ, భూగర్భ జలాలు, విద్యుత్ శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు కార్యాచరణను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన వర్షపాతం లోటు ఎంత, దాని ప్రభావం ఏమిటనే అంశాలపై ప్రతి రైతుకు స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు సరైన నిర్ణయాలు తీసుకునేలా ప్రభుత్వం వద్ద ఉన్న వాస్తవ సమాచారం క్షేత్రస్థాయిలో నిరంతరం ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గత ఏడాది, ఈ ఏడాది నీటి వనరుల లభ్యత, జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితిపై వివరాలతో ప్రణాళిక శాఖ సమగ్ర నివేదిక సిద్ధం చేసి మీడియాకు, క్షేత్రస్థాయి అధికారులకు, రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించిన మేరకు రాజీవ్ లింక్ కాలువ ద్వారా గోదావరి జలాలను ఖమ్మం జిల్లా అవసరాలకు ఎలా వినియోగించుకోవచ్చో అన్ని సాంకేతిక అవకాశాలను పరిశీలించి తక్షణమే సమగ్ర నివేదిక సమర్పించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వర్షపాతం పరిస్థితులు, నీటి వనరుల లభ్యత, భూగర్భ జలాల పరిస్థితిపై రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. నీటి లభ్యతను బట్టి మాత్రమే రైతులు పంటల ఎంపిక చేసుకునేలా క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఈ ఖరీఫ్‌లో సాగునీరు వచ్చే పరిస్థితి లేదని, పాలేరు ఆయకట్టుకు కూడా సాగునీరు అందుబాటులో ఉండదని రైతులకు స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. వాస్తవ పరిస్థితులను దాచకుండా అధికారులు నేరుగా రైతులతో మాట్లాడాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో త్రాగునీటి అవసరాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఎక్కడైనా త్రాగునీటి వనరులు సరిపోని పరిస్థితి ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ వనరులను గుర్తించి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రాబోయే ఒక సంవత్సరం త్రాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. భూగర్భ జలాల లభ్యత ఆధారంగా మాత్రమే పంటల ప్రణాళిక రూపొందించాలని, వరి వంటి నీటి అధిక అవసరమున్న పంటలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించవద్దని స్పష్టం చేశారు. పెసర, మినుములు, కందులు, అలసంద, చిరుధాన్యాలు వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను మాత్రమే రైతులు సాగు చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో నీటి సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశము ఉన్నందున బోర్ల ఆధారంగా వరి సాగు చేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనాలు, భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో కూడా ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం గణనీయంగా తగ్గిందని, నిపుణుల అభిప్రాయం ప్రకారం ఇటువంటి తీవ్రమైన కరువు పరిస్థితులు దాదాపు 150 సంవత్సరాలకు ఒకసారి సంభవించే అవకాశం ఉన్నందున ప్రతి మండల స్థాయి అధికారి అత్యంత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశముందని, థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున రానున్న రోజుల్లో విద్యుత్ సరఫరా పై కూడా ప్రభావం పడే అవకాశముందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో బోర్లపై ఆధారపడి నీటి అధిక అవసరమున్న పంటలను సాగు చేయకుండా రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. రైతు వేదికలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రతి గ్రామంలో రైతులతో సమావేశాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. అధికారులు మౌనంగా ఉండకుండా వాస్తవ పరిస్థితులను రైతులకు స్పష్టంగా తెలియజేయాలని, సమాచార ప్రసారంలో సమర్థవంతమైన విధానాన్ని అవలంబించాలని సూచించారు. నీటి లభ్యత లేని పరిస్థితుల్లో వరి సాగు చేస్తే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఏమీ చేయలేదనే పరిస్థితి రాకుండా ముందుగానే స్పష్టమైన అవగాహన కల్పించాలని అన్నారు. నీటి లభ్యత లేని పరిస్థితుల్లో వరి సాగు చేస్తే అది పూర్తిగా రైతుల సొంత బాధ్యతేనని స్పష్టమైన సందేశం క్షేత్రస్థాయిలో చేరాలని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాధ్యమైనన్ని ప్రాంతాల్లో గోదావరి బ్యాక్‌వాటర్‌ను ఎత్తిపోసి చెరువులను నింపేందుకు అవసరమైన మోటార్లు, విద్యుత్ సదుపాయాలు ఏర్పాటు చేసి ఇంజినీర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుతం గోదావరి నీటిని వినియోగించి చెరువులను నింపగలిగితే వచ్చే వేసవి వరకు త్రాగునీటి అవసరాలను తీర్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఖరీఫ్‌లో సాగునీటికి నీరు అందుబాటులో లేని పరిస్థితుల్లో రాజీవ్ లింక్ కాలువ ద్వారా గోదావరి జలాలను ఖమ్మం జిల్లా అవసరాలకు ఎలా వినియోగించాలనే అంశంపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రస్తుతం వైరా, లంకా సాగర్ జలాశయాలను త్రాగునీటి అవసరాల కోసమే నింపుతున్నామని, పాలేరు జలాశయంలో కూడా సెప్టెంబర్–2026 వరకు మాత్రమే తాగునీటి నిల్వలు ఉండే అవకాశం ఉందని తెలిపారు. రాజీవ్ లింక్ కాలువ ద్వారా గోదావరి నీటిని పాలేరు జలాశయానికి తరలించే అవకాశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులను అవకాశంగా మలుచుకొని ఆయిల్‌పామ్ సాగు విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే ఆయిల్ పామ్, పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాలు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రాబోయే మూడు నెలల పరిస్థితులకే పరిమితం కాకుండా కనీసం ఒక సంవత్సరం కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రతి మండలానికి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి ప్రతి రైతుకు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాతావరణ, వ్యవసాయ, నీటిపారుదల, భూగర్భ జలాల, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో స్థానిక సమాచారాన్ని విశ్లేషించి మండల స్థాయి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ప్రతి మండలంలో జిల్లా కలెక్టర్లు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి మండలానికి సంబంధించిన ధృవీకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు అందించాలని తెలిపారు. మండల స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు, జిల్లా స్థాయిలో సమగ్ర కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి వర్షపాతం, త్రాగునీటి పరిస్థితి, భూగర్భ జలాలు, విద్యుత్ సరఫరా, పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జూలై 31వ తేదీ వరకు జిల్లాలో పప్పు ధాన్యాలు, అలసంద, కందులు, పెసర వంటి ప్రత్యామ్నాయ పంటల సాగు జరిగేలా గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితి, సాగునీటికి ఉన్న అవకాశాలపై స్పష్టమైన సమాచారాన్ని సిద్ధం చేయాలని సూచించారు. సొంత బోర్లు ఉన్న రైతుల వివరాలను సేకరించి, ముఖ్యంగా సత్తుపల్లి ప్రాంతంలో అధికంగా వరి సాగు జరుగుతున్నందున అక్కడ ప్రత్యేక దృష్టి సారించి రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో వరి సాగును నిరుత్సాహ పరుస్తూ కూరగాయల సాగును కూడా ప్రోత్సహిస్తున్నామని, అవసరమైన విత్తనాలను ఇప్పటికే సిద్ధంగా ఉంచామని చెప్పారు. క్షేత్రస్థాయిలో పూర్తి సమాచారం అధికారులకు అందుబాటులో ఉండాలని, ప్రస్తుతం జరుగుతున్న అన్ని ఎత్తిపోతల ద్వారా నీటి సరఫరా త్రాగునీటి అవసరాల కోసమేనని, సాగునీటి కోసం కాదనే విషయాన్ని రైతులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఆగస్టు 1వ తేదీ నుండి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ ఏడాది అదనంగా 8 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు వచ్చారని, మరో 5 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటల విస్తరణ లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. కృష్ణా, గోదావరి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు లేకపోవడం, భూగర్భ జలాలు కూడా వేగంగా తగ్గిపోతున్న పరిస్థితిని క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తిగా వివరించి, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటల ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం డిప్యూటీ సీఎం, మంత్రివర్యులు, జిల్లా ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ తెలంగాణ జలసిరి, ఎల్ నినో సూపర్ స్థితిలో తీసుకునే చర్యలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి, సుడా చైర్‌పర్సన్ దుర్గా ప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్‌వో, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఉమ్మడి ఖమ్మం జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, నీటిపారుదల, భూగర్భ జలాలు, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాఠశాలలకు ల్యాబ్ పరికరాలు అందజేత

- అందజేసిన అడ్వాంటా సీడ్స్ సంస్థ
- విద్యార్థుల పరిశోధన ఆసక్తినీ పెంపొందించడమే మా సంస్థ లక్ష్యం
- విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి
- అడ్వాంటేజ్ సీడ్స్ రీజినల్ మేనేజర్ వెంకటేష్





**బోనకల్, జులై 20 (ప్రజా జ్యోతి):** ప్రముఖ వ్యవసాయ విత్తన సంస్థ అడ్వాంటా సీడ్స్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి ఎస్ ఆర్) కార్యక్రమంలో భాగంగా మండలంలోని రావినూతల, బోనకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు సోమవారం భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, గణితం, జీవశాస్త్రం విభాగాలకు సంబంధించిన పూర్తిస్థాయి ల్యాబ్ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా అడ్వాంటా సీడ్స్ రీజనల్ మేనేజర్ వెంకటేష్ మాట్లాడుతూ...6వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు చదువుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో పరిశోధనా ఆసక్తిని పెంపొందించడమే సంస్థ లక్ష్యమన్నారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు ప్రయోగాలను స్వయంగా నిర్వహిస్తూ కొత్త విషయాలను తెలుసుకోవాలని, సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అందజేసిన ల్యాబ్ పరికరాల ద్వారా విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రత్యక్ష ప్రయోగాల ద్వారా పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. పరిశీలనా నైపుణ్యాలు, ప్రయోగాత్మక అభ్యాసం పెంపొందడంలో ఈ పరికరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. పూర్తిస్థాయి ల్యాబ్ పరికరాలను అందించిన అడ్వాంటా సీడ్స్ రీజనల్ మేనేజర్ వెంకటేష్ ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి, సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోనకల్ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అట్లూరి గోపీచంద్, రావినూతల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు సురేష్, నరసింహారావు, బానోత్ రమేష్, ప్రమీల, సరస్వతి, మంగతాయారు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ను గడువులోగా పూర్తి చేయాలి

- రాష్ట్ర ఇన్ చార్జ్ దుద్దిళ్ల శ్రీనుబాబు



**చింతకాని జులై 20 ప్రజాజ్యోతి :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా వంద శాతం పూర్తి చేయాలని రాష్ట్ర ఎస్ఐఆర్ ఇన్‌చార్జ్ దుద్దిళ్ల శ్రీనుబాబు సూచించారు. ఈ మేరకు చింతకాని మండల పరిధిలోని గాంధీనగర్ సర్పంచ్ ఓర్స్ వీరభద్రం నివాసంలో మధిర నియోజకవర్గ ఎస్ఐఆర్ ఇన్‌చార్జ్‌లు, సూపర్వైజర్లు, బీఎల్ఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో చింతకాని మండలంలోని 56 నుంచి 63 వరకు ఉన్న బూతుల్లో ఎస్ఐఆర్ పని ప్రస్తుతం 80 శాతం పూర్తైందని, రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మిగిలిన పనులను వేగవంతం చేసి త్వరితగతిన 100 శాతం పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి బీఎల్ఏ పూర్తి బాధ్యతతో పనిచేసి మండలాన్ని ముందంజలో నిలపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి యాదవ్, మధిర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్ఐఆర్ ఇన్‌చార్జ్ మల్లెల అజయ్, మండల ఇన్‌చార్జ్ తిరుపతి యాదయ్య, మండల సూపర్వైజర్లు, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

## శభాష్ ఆనంద్ సార్



**నేలకొండపల్లి, జులై 20 ప్రజా జ్యోతి:** పాఠాలతో పాటు విద్యార్థులు ఆరోగ్య రక్షణ కోసం కూడా పాటుపడతారని నిరూపించాడు.. ఓ ఉపాధ్యాయుడు..... నేలకొండపల్లి మండలంలోని మంగాపురం తండా ప్రాథమిక పాఠశాల లో నాలుగో తరగతి చదువుతున్న...యోగిత అనే విద్యార్థినికి...సోమవారం ఆడుకుంటుండగా గాయమైంది... విద్యార్థి కాలికి గాయం వద్ద కారుతున్న రక్తాన్ని చూసి చలించిన స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నందిగామ ఆనంద్ విద్యార్థినికి ప్రథమ చికిత్స చేశారు. కాలుకు తగిలిన దెబ్బ ను శుభ్రపరిచాడు. కట్టు కట్టి దగ్గరుండి ఇంటికి పంపించారు. ఉపాధ్యాయులు పాఠాలు బోధించటమే కాదు విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ కూడా తమదే బాధ్యత తమదేనని ఉపాధ్యాయుడు ఆనంద్ నిరూపించడంతో గ్రామస్తులు అభినందించారు. సర్పంచ్ దిరావత్ అశోక్ రాణి, గ్రామ పెద్దలు శభాష్ సారు అంటూ ప్రశంసించారు.

## దళిత హక్కుల సాధనకు ఐక్య పోరాటమే మార్గం

- జూలై 27న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాను విజయవంతం చేయాలి
- డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యంగల ఆనందరావు



**బోనకల్, జులై 20 (ప్రజా జ్యోతి):** దళితులకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కులను పరిరక్షించడంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి యంగల ఆనందరావు పిలుపునిచ్చారు. ఆదివారం బోనకల్ మండల కేంద్రంలోని కాకాటి కరుణాకర్ నివాసంలో నిర్వహించిన డీహెచ్‌పీఎస్ మండల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సామాజిక న్యాయం, సమాన హక్కుల కోసం దళితులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీలు నేటికీ అమలుకు నోచుకోకపోవడం విచారకరమని, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో దళిత వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని విమర్శించారు. దళితులకు కేటాయించిన భూములను ఆక్రమణల నుంచి స్వాధీనం చేసుకుని అసలు హక్కుదారులకు అప్పగించాలని, రెండెకరాల భూమి హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేయడంతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని కోరారు. సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, స్వయం ఉపాధిని ప్రోత్సహించేలా ఇండస్ట్రియల్ రుణాలను సబ్సిడీతో మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జూలై 27న ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో దళితులు, యువత, మహిళలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీ హెచ్‌పీఎస్ మండల కన్వీనర్ కాకాటి కరుణాకర్, నాయకులు మాతంగి రామ్ కిరణ్, యువజన నాయకులు కోసూరీ అభి, రాజేష్ పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ముత్యాలమ్మ తల్లి పూజలు



**నేలకొండపల్లి, జులై 20 ప్రజా జ్యోతి:** నేలకొండపల్లి మండలంలోని బోదులబండ గ్రామంలో ముత్యాలమ్మ తల్లి దేవాలయం వద్ద 16 రోజుల పండుగ అత్యంత వైభవంగా జరిగింది. సోమవారం వేదమంత్రాల నడుమ అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు. సాముహిక వ్రతాలు నిర్వహించారు. గ్రామపంచాయతీ సర్పంచ్ కట్టెకోల నాగార్జున ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి ముక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దేవాలయ అభివృద్ధికి విరాళం అందజేసిన బొగ్గుల మల్లిక

**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలో వెంకటాపురం గ్రామ శ్రీ శ్రీ శ్రీ దుర్గ మల్లేశ్వర (బాల కోటేశ్వర) స్వామి దేవస్థానానికి, వెంకటాపురం గ్రామానికి చెందిన దివంగత బొగ్గుల ప్రతాపరెడ్డి జ్ఞాపకార్థం వారి సతీమణి బొగ్గుల మల్లిక దేవాలయ అభివృద్ధి మరియు అవసరాల నిమిత్తం రూ.1,00,000/- (ఒక లక్ష రూపాయలు) విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని వెంకటాపురం గ్రామ సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డి కి ఈరోజు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రుపాలెం మండల కెమిస్ట్స్ & డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కర్నాటి సుధాకర రెడ్డి రాజుపాలెం సొసైటీ అధ్యక్షులు వెన్నపూస కృష్ణారెడ్డి కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు వెర్రు వెంకటేశ్వరరావు బొగ్గుల మల్లిక కుటుంబ సభ్యులు, రిటైర్డ్ ఎస్ .ఐ. కర్నాటి వెంకటేశ్వర్ రెడ్డి కుడుముల జమలారెడ్డి (ఎంపీడీవో), మాజీ సర్పంచ్ బొగ్గుల లక్ష్మీ మాజీ సర్పంచ్ వెన్నపూస వెంకటరెడ్డి తలపరెడ్డి కృష్ణారెడ్డి బొగ్గుల గోపిరెడ్డి వెన్నపూస నాగిరెడ్డి అవులూరి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి పాస్టర్ కి సంక్షేమ పథకాలు అందించాలి

- పాస్టర్ ఫెలోషిప్ మధిర నియోజకవర్గ అధ్యక్షులు కే చెన్నయ్య



**బోనకల్, జులై 20 (ప్రజా జ్యోతి):** మధిర నియోజకవర్గం పాస్టర్ ఫిలో షిఫ్ సమావేశాన్ని మండల పరిధిలోని ఆళ్ల పాడు గ్రామంలో పాస్టర్ ఫెలోషిప్ మండల వైస్ ప్రెసిడెంట్ కే జ్ఞానయ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. జరిగిన ఈ సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షులు ఎం చెన్నయ్య మాట్లాడుతూ... దేశ క్షేమం కొరకు, రాష్ట్ర క్షేమం కొరకు పాటు పడే వారిలో క్రైస్తవులు ముందువరుసలో ఉంటారని, వీరే నిరాధారణకు గురి అవుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను నోచుకో లేకుండా పోతున్నారని కాబట్టి ప్రభుత్వం స్పందించి అర్హులైన ప్రతి పాస్టర్ కి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పాటు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, అదేవిధంగా దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించి ఎస్సీ హోదా కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి పాస్టర్ పి రాజారత్నం, ఎస్ చిట్టిబాబు, నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ డేవిడ్, విల్సన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మల మాటలకే పరిమితం అయ్యారు

- **బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు గల్ల సత్య నారాయణ**



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** బి ఆర్ ఎస్ ప్రభుత్వం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై నాటి బి ఆర్ ఎస్ పార్టీకి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నందుకు నాపై రాజకీయ కక్షసాధింపు ధోరణితో నమోదు చేసిన కేసుల విషయంలో సోమవారం ఖమ్మం జిల్లా కోర్టుకు హాజరయ్యాను.ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకు నాపై తప్పుడు ఆరోపణలు చేసి కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఈ సందర్భంగా పేర్కొంటున్నాను.ప్రజల హక్కుల పరిరక్షణ,రైతుల సమస్యల పరిష్కారం, అవినీతి,అక్రమాలపై గళమెత్తడం ప్రజల తరఫున పోరాటం చేయడం భారతీయ జనతా పార్టీ నాయకునిగా మా యొక్క బాధ్యతగా భావిస్తున్నాను. ప్రజా ప్రయోజనాల కోసం చేస్తున్న పోరాటాన్ని అణచివేయడానికి ఎన్ని ఒత్తిళ్లు,బెదిరింపు లు,తప్పుడు కేసులు వచ్చినా వెనుకడుగు వేయబోనని స్పష్టం చేస్తున్నాను,రాష్ట్ర మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు ఎన్నికలకు వెళుతున్నటువంటి సందర్భంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో తప్పుడు కేసులు నమోదు చేసిన వారందరిపై కూడా కేసులు ఎత్తివేస్తామని చెప్పారని నేటి వరకు కనీసం దానిపై ఒక రివ్యూ కానీ ఒక స్టేట్మెంట్ కానీ తుమ్మల నాగేశ్వరరావు దగ్గర నుంచి రాలేదని తుమ్మల నాగేశ్వరరావు కేవలం మాటలకే పరిమితం అయ్యారు తప్ప హామీలను ఆచరణలో పెట్టలేకపోయారని అన్నారు,మరొక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రుద్ర ప్రదీప్ మాట్లాడుతూ అక్రమ కేసులకు భయపడేది లేదని ప్రజా సమస్యల కోసం మరింత పోరాటం చేస్తామని అన్నారు, ఈ యొక్క కార్యక్రమంలో యువమోర్చా ఖమ్మం జిల్లా అధ్యక్షులు అనంత ఉపేందర్ గౌడ్, ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ మారుతి వీరభద్ర ప్రసాద్, మహిళా మోర్చా నాయకురాలు నీరుకొండ ఉషారాణి, జిల్లా నాయకులు పిల్లలమర్రి వెంకట్, డీకొండ శ్యామ్, నాయకులు ఇస్లావత్ రాంబాబు, సామల ప్రవీణ్ రెడ్డి,ఉన్నారు, కోర్టు హాలు నందు సహకరించినటువంటి లీగల్ టీం సుగ్గుల వెంకట గుప్తా, తుమ్మ శివ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమంను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



**చింతకాని జులై 20 ప్రజాజ్యోతి :** సీతంపేట గ్రామంలో ఎస్ఐఆర్ కార్యక్రమం జరుగుతున్న తీరును గ్రామ కాంగ్రెస్ నాయకులు పరిశీలించి బిఎల్ఓ శ్రీనివాసరావు కి పలు సూచనలు చేసారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు ఆళ్ల పానకాలరావు, కొత్తపల్లి బసవయ్య,బూత్ ఇంచార్జ్ కంచర్ల సైదులు, చంద్రకాని శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఓటర్లు అందరూ తమ ఓటు హక్కును కాపాడుకోవాలని, బిఎల్ఓ కి తగిన గుర్తింపు సర్టిఫికెట్ ఇచ్చి వారికి సహకరించాలని తెలిపారు.

## 108 అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ

- **తనిఖీ చేసిన జిల్లా మేనేజర్ ఆలేటి ప్రణయ్ కుమార్**



**బోనకల్, జులై 20 (ప్రజా జ్యోతి):** బోనకల్ మండల కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న చింతకాని, బోనకల్ మండల పరిధిలో సేవలందిస్తున్న 108 అం బులెన్స్ ను ఖమ్మం జిల్లా మేనేజర్ ఆలేటి ప్రణయ్ కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్ లో ఉన్న మందుల ను, రికార్డ్స్ను ఎక్విప్మెం ట్స్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎప్పటికప్పుడు అన్ని పరికరాలు పని చేసే విధంగా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఇక్కడ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్నన్ను నంద్రు మనోహర్, కోట భానుసహాన్ పైలెట్స్ ఎం ఎం చక్రవర్తి కలసాని వెంకట్రావు లను అభినందించారు. 108 సేవలు ఎటువంటి లోపం లేకుండా ఇదేవిధంగా కొనసాగించాలని కోరారు.

## సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాద బాధిత రైతులకు 100 శాతం ఇన్సూరెన్స్ ఇవ్వాలి

- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జోక్యం చేసుకోవాలి**
- **రైతు సంఘం నాయకులు డిమాండ్**



**మధిర ప్రజా జ్యోతి** సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజ్లో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన మిర్చి రైతులకు 100 శాతం ఇన్సూరెన్స్ పరిహారం వెంటనే అందించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారూ సోమవారం మధిర తాసిల్దార్ కార్యాలయం ముందు కోల్డ్ స్టోరేజ్ మిర్చి బాధిత రైతులు ధర్నా నిర్వహించి, తాసిల్దార్ కి వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూప్రమాదం జరిగి మూడు నెలలు గడుస్తున్నా బాధిత రైతులకు ఎలాంటి నష్టపరిహారం అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో పెట్టుబడులకు నిధులు లేక, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, అప్పుల చెల్లింపుల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని స్థానిక డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇన్సూరెన్స్ కంపెనీలతో చర్చించి బాధిత రైతులకు వెంటనే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బొంతు రాంబాబు, జిల్లా కార్యదర్శి మాదినేని రమేష్, కన్వీనర్ దివెల్ల వీరయ్య, సీతారాం రెడ్డి, నాయకులు మడిపల్లి గోపాలరావు, మందడపు ఉపేంద్ర, పడకంటి మురళి తదితరులు, బాధిత రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు న్యాయ అవగాహన

- **పి దేవి మానస**




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి పి. దేవి మానస తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్,జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థినులకు న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా న్యాయ సేవా సంస్థల చట్టం,సైబర్ నేరాలకు సంబంధించిన చట్టాలు,పిల్లల హక్కులు,బాలల రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే ఆర్ట్స్ విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించి,చరిత్ర,రాజకీయ శాస్త్రం, ఆర్థిక శాస్త్రం వంటి అంశాలు పరిపాలన,న్యాయశాఖ, సివిల్ సర్వీసులు,బోధన, జర్నలిజం తదితర రంగాల్లో ఉన్నత అవకాశాలకు పునాది తెలిపారు.విద్యార్థినులతో ప్రత్యక్షంగా ముచ్చటించి సందేహాలను నివృత్తి చేశారు.ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివి భవిష్యత్తులో దేశానికి ఉపయోగపడే అధికారులు, న్యాయవాదులు,ఉపాధ్యాయులు, ప్రజా సేవకులుగా ఎదగాలని ప్రోత్సహించారు.

## మండలానికి మరో నూతన విద్యుత్ శాఖ ఏఈ గా జి. మోహన్

**బోనకల్, జూలై 20 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని 12 గ్రామాలకు గాను విద్యుత్ శాఖ నూతన సెక్షను ఏర్పరిచిన దానిలో భాగంగా కలకోట సెక్షన్ కు మరో నూతన విద్యుత్ శాఖ ఏఈ జి మోహన్ ను నియమించారు. బోనకల్ సబ్ డివిజన్ కార్యాలయం నందు సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా 12 గ్రామాలకు మరో నూతన విద్యుత్ శాఖ ఏ ఈ గా బాధ్యతలు స్వీకరించిన జి మోహన్ కు బోనకల్ విద్యుత్ శాఖ సిబ్బంది శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులకు సమస్యలు తొందరగా పరిష్కరించడం కొరకు నూతన సెక్షన్ ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ ఏడి వైవి ఆనందకుమార్ తెలిపారు. మరో నూతన విద్యుత్ శాఖ ఏఈ జి. మోహన్ మాట్లాడుతూ.. మండలంలోని విద్యుత్ వినియోగదారులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని ఆయన అన్నారు. మండలంలోని ప్రజలు ప్రతి ఒక్కరూ తమకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మండల విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## మట్టిలో మహిళ ఆణిముత్యం

- **కాబోయే వైద్యురాలుగా...**
- **జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన బానోత్. పార్ధవి**



**పాలేరు ఆర్.సీ జూలై20 ప్రజా జ్యోతి** కూసుమంచి మండలం, గురువాయిగూడెం తండాకు చెందిన పార్ధవి బా నోతు నీట్ (యూజీ)–2026 లో విశే ష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.పార్ధవి తండ్రి బి. కోటేశ్వర రావు, బీఎస్ఎన్ఎల్లో సబ్ డివిజనల్ ఇంజనీర్ (ఎస్డీఈ–టీఎం)గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి కిరణ్మయి గృహిణి. పిల్లల విద్యాభివృద్ధి కోసం ఆమె పూర్తిగా కుటుంబానికే అంకితమయ్యారు.తండ్రి ఉద్యోగ రీత్యా వివిధ రా ష్ట్రాల్లో చదువుకున్న పార్ధవి, అనంతరం ఖమ్మంలోని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్లో 6 వ తరగతి నుంచి సీబీఎస్ఈ 12వ తరగతి వరకు విద్యను అభ్యసించింది. 2026 జూన్ 21న నిర్వహించిన నీట్ (యూజీ) పరీక్షలో పార్ధవి 604 మార్కులు సాధించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) విడుదల చేసిన ఫలితాల ప్రకారం ఆమెకు ఆల్ ఇండియా ర్యాంక్ (AIR) 8855 లభించగా, ఎస్టీ విభాగంలో ఆల్ ఇండియా ర్యాంక్ 61 సాధించి అరుదైన ఘనతను అందుకుంది.ప్రత్యేకంగా ఎస్టీ కేటగిరీలో జాతీయ స్థాయిలో 61వ ర్యాంకు సాధించడం పట్ల పార్ధవి ఆనందం వ్యక్తం చేసింది. ఈ ర్యాంకుతో దేశంలోని ప్రతిష్ఠాత్మక వైద్య విద్యాసంస్థలైన ఎయిమ్స్ జిప్మర్ లో ఎంబీబీఎస్ సీటు పొందే అవకాశాలు ఉన్నాయని కు టుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని జాతీయ స్థాయిలో ఈ స్థాయి విజయాన్ని సాధించడం పట్ల గురువాయిగూడెం తండా ప్రజలు, బంధుమిత్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ పార్ధవికి అభినందనలు తెలిపారు. ఆమె భవిష్యత్తులో ఉత్తమ వైద్యురాలిగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

## వేంసూరు మండలంలో చిరుజల్లులు

- **రైతులు కళ్ళల్లో వెల్లువిరిసిన ఉత్సాహం**



**వేంసూర్ జూలై 20 ప్రజా జ్యోతి** మొత్తానికి మండల పరిధిలో చిరుజల్లు కురిసాయి వాతావరణంలో స్వల్ప మార్పులు వచ్చాయి జులై నెల అంతా ఎండాకాలం గా ఉంది కానీ వాతావరణంలో కొద్దిపాటి మార్పులు వచ్చి సోమవారం చిరుజల్లు పడ్డాయి రైతులు నారు పోసుకొని వర్షం కోసం ఎదురుచూస్తున్నారు కనీసం ఈ చిన్న చిన్న జల్లులకైనా నారు ఎండిపోకుండా బ్రతికే అవకాశం ఉం దని రైతులు చాలా ఆనందం గా ఉన్నారు ఆశలు మొత్తానికి కాలం దరిదాపుగా పూర్తయ్య సమయానికి జూలై చివరి మాసంలో వాతావరణంలో మార్పులు వస్తున్నాయి వాతావరణం చల్లబడుతుంది చిన్న చిన్న జల్లులు కురుస్తున్నాయి ఒకటి రెండు పెద్ద వర్షాలు వస్తే రైతులందరూ మరల నాట్లు వేసుకునే అవకాశం ఉంటుంది దేవుడు కరుణించి ఒకటి రెండు రోజుల్లో వర్షాలు పడితే వ్యవసాయం చేసుకోవచ్చని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణకు శ్రీకారం

- 9 మీటర్ల విద్యుత్ స్తంభాలు, నూతన ట్రాన్స్‌ఫార్మర్ల పనులకు శంకుస్థాపన
- నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందుబాటులో ఉంటుంది
- బోనకల్ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ



**బోనకల్, జూలై 20 ప్రజాజ్యోతి :** బోనకల్ గ్రామంలో విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో సోలార్ మీటర్ల కొరకు 9 మీటర్ల విద్యుత్ స్తంభాల ఏర్పాటు, నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్మాణ పనులకు విద్యుత్ శాఖ అధికారులు, బోనకల్ గ్రామపంచాయతీ పాలకవర్గం సోమవారం సంయుక్తంగా శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ.. గ్రామంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పనులను చేపట్టడం జరిగిందన్నారు.నూతన స్తంభాలు,ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు పూర్తయిన అనంతరం తక్కువ వోల్టేజ్ సమస్యలు తగ్గడంతో పాటు, నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతూ.. పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. గ్రామాభివృద్ధిలో భాగంగా విద్యుత్ మౌలిక సదుపాయాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బానోతు కొండ, విద్యుత్ శాఖ అధికారులు ప్రవీణ్ కుమార్, రాజేష్, గ్రామ పెద్దలు గుండపనేని సుధాకర్ రావు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు మరిదు శేషు, అంతోటి శ్రీను, పోటు వెంకటేశ్వర్లు, షేక్ మీరా సాహెబ్, ఉప్పర శ్రీను, నాయకులు తేళ్లూరి రమేష్ , కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి భూక్య బాలకృష్ణ, అంతోటి వెంకటేశ్వర్లు, చిన్న నరసింహ, తోటపల్లి స్వామి, రామాచారి గ్రామ పెద్దలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయి నుండి ప్రపంచ స్థాయికి ఎదిగిన ధర్మ గీత ఇనిస్టిట్యూట్ అధినేతలు!

- మారుమూల పల్లె మేడిపల్లి కీర్తిని అంతర్జాతీయ స్థాయికి చాటిన అన్నదమ్ములు
- జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో స్వదేశంలో విద్యా విప్లవం
- ఖమ్మం జిల్లా విద్యార్థులకు అంతర్జాతీయ అవకాశాల కల్పనే ధ్యేయం

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** కృషి, పట్టుదల, సమాజం పట్ల బాధ్యత ఉంటే మారుమూల గ్రామం నుండి కూడా ప్రపంచ స్థాయిని శాసించవచ్చని నిరూపించారు 'ధర్మ గీత ఇన్స్టిట్యూట్' అధినేతలు. ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలానికి చెందిన ఒక మారుమూల పల్లెటూరు 'మేడిపల్లి'. అలాంటి చిన్న గ్రామం నుండి ప్రయాణాన్ని ప్రారంభించి,నేడు ప్రపంచ వేదికపై తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకోవడమే కాకుండా, తాము నేర్చుకున్న అంతర్జాతీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వదేశీయులకు అందించాలనే ఉన్నత ఆశయంతో అడుగులు వేస్తున్నారు. ఆ సంస్థ నిర్వాహకులు.

### ››› ఒకే మాట.. ఒకే బాట: ఆదర్శ అన్నదమ్ములు...

మేడిపల్లి గ్రామానికి చెందిన పోతునూక మధుసూదన్ రావు, సుజాత దంపతుల ద్వితీయ కుమారుడు శ్రీనాథ్, అలాగే పోతునూక నాగేశ్వరరావు, (లేట్ )జ్యోతి దంపతుల ప్రథమ కుమారుడు రాంప్రసాద్. వీరిద్దరూ వరసకు అన్నదమ్ముల పిల్లలైనప్పటికీ, చిన్ననాటి నుండి ఒకే తల్లి బిడ్డల్లా పెరిగారు. "ఒకే మాట.. ఒకే బాట" అనే సిద్ధాంతంతో, పరస్పర నమ్మకం, ఒకే విధమైన ఉన్నత ఆశయాలతో వ్యాపార, విద్యా రంగాలలో దూసుకుపోతున్నారు. వీరి నడుమ ఉన్న అనుబంధం, ఒకరికొకరు ఇచ్చుకునే మద్దతు నేటి సమాజంలో ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది.

### ››› పల్లెటూరి నుండి జర్మనీ వరకు విద్యా ప్రస్థానం.

శ్రీనాథ్, రాంప్రసాద్ ఇద్దరూ చిన్నప్పటి నుంచే చదువుపై అమితమైన శ్రద్ధ కనబరిచారు. ప్రాథమిక విద్యను తమ సొంత గ్రామమైన మేడిపల్లిలోనే పూర్తి చేశారు. గ్రామీణ వాతావరణంలో పెరిగినప్పటికీ, వారి ఆలోచనలు ఎప్పుడూ ఉన్నతంగా ఉండేవి. ఆ పట్టుదలతోనే ఉన్నత చదువుల కోసం పట్టణాలు, నగరాలకు చేరుకుని, తమ ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. ఆ తర్వాత అంతర్జాతీయ అవకాశాలను అందుకుని గ్లోబల్ లీడర్లుగా ఎదిగి, చివరకు జర్మనీ దేశంలో స్థిరపడ్డారు.జర్మనీ సాంకేతికతతో 'ధర్మ గీత ఇన్స్టిట్యూట్' స్థాపన. జర్మనీ లాంటి అభివృద్ధి చెందిన దేశంలో స్థిరపడినప్పటికీ, వారి మనసంతా ఎప్పుడూ భారతదేశంపై, ముఖ్యంగా తమ సొంత ప్రాంత ప్రజలపైనే ఉండేది. జర్మనీలో అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని,ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలను మన దేశంలోని విద్యార్థులకు, యువతకు అందించాలనే తపన ఇరువురిలో మొదలైంది. ఆ తపన, ఆలోచనల నుండే పురుడుపోసుకున్నదే 'ధర్మ గీత ఇన్స్టిట్యూట్'.హైదరాబాద్ కేంద్రంగా ప్రారంభమైన ఈ సంస్థ, ప్రస్తుతం అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో విద్యార్థులకు అంతర్జాతీయ స్ థాయి శిక్షణను అందిస్తోంది. ముఖ్యంగా జర్మన్ టెక్నాలజీ, భాషా నైపుణ్యాలైన A1 నుండి C1 (A1 to C1) స్థాయి వరకు అత్యంత నిపుణులచే ఇక్కడ శిక్షణ ఇవ్వబడుతోంది. జర్మనీ వెళ్లాలనుకునే విద్యార్థులకు, నిపుణులకు ఈ గ్లోబల్ పరిజ్ఞానం ఒక వరంగా మారింది.మేము ఎంత ఎదిగినా మా మూలాలు మా పల్లెలోనే ఉన్నాయి. జర్మనీలో ఉన్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని చూసినప్పుడు,మా దేశంలోని యువతకు కూడా ఇటువంటి అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతోనే 'ధర్మ గీత ఇన్స్టిట్యూట్'ను స్థాపించాము."

### ››› శ్రీనాథ్ & రాంప్రసాద్ (అధినేతలు)

సొంత జిల్లాపై మక్కువ.. ఖమ్మంలో సేవలకు సన్నద్ధంహైదరాబాద్‌లోనే కాకుండా, తమ జన్మభూమి అయిన ఖమ్మం జిల్లా విద్యార్థులకు కూడా ఇదే స్థాయి అంతర్జాతీయ శిక్షణను, గ్లోబల్ నైపుణ్యాలను అందుబాటులోకి తేవాలని నిర్ణయించుకున్నారు. ఖమ్మం చుట్టుపక్కల ఉన్న గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులు ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలను అందుకోవాలనే సంకల్పంతో త్వరలోనే ఖమ్మంలో కూడా తమ సేవలను విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

### ››› మట్టి వాసనపై మక్కువ.. వ్యవసాయంలోనూ ఆదర్శం

సాంకేతిక రంగంలో ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ, పోతునూక రాంప్రసాద్‌కు పల్లెటూరి మట్టి వాసనపై, వ్యవసాయంపై ఉన్న మక్కువ తగ్గలేదు. ఒకవైపు అంతర్జాతీయ విద్యా సంస్థను నడుపుతూనే, మరోవైపు స్వయంగా వ్యవసాయం చేస్తూ భూమిని నమ్ముకుని జీవిస్తున్నారు. ఆధునికతను అందిపుచ్చుకుంటూనే సంప్రదాయాన్ని,వ్యవసాయాన్ని గౌరవిస్తూ ఆయన సాగిస్తున్న ఈ ప్రయాణం యువతకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తోంది.ప్రజల హర్షం – దిగ్విజయం కావాలని ఆకాంక్ష గ్రామస్థాయి నుండి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి, తిరిగి సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో ఉన్న శ్రీనాథ్,రాంప్రసాద్ ల తపనను మేడిపల్లి గ్రామ ప్రజలతో పాటు, ముదిగొండ మండలం, ఖమ్మం జిల్లా ప్రజలు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నారు.జర్మనీ టెక్నాలజీ (A1–C1) పరిజ్ఞానాన్ని అందిస్తూ, విద్యా రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలికిన వీరి 'ధర్మ గీత ఇన్స్టిట్యూట్' భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని,ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలని ప్రజలు,ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.





# ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించిన అధికారులు



**చింతకాని జులై 20 ప్రజాజ్యోతి :** చింతకాని మండల పరిధిలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) ప్రక్రియను వేగవంతంగా,పారదర్శకంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు,బీఎల్ఓలు, బీఎల్ఏలు మరియు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే, దరఖాస్తుల పరిశీలన,అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో నమోదు చేయడం, అభ్యంతరాలు మరియు మార్పులను నిబంధనల ప్రకారం పరిష్కరించడం వంటి అంశాలపై అధికారులు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నిష్పక్షపాతంగా పూర్తి చేయాలని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రజలు కూడా తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు,చేర్పులు చేయించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో బీఎల్ఓలు, బీఎల్ఏలు, బీఎల్ఓ సూపర్వైజర్,సంబంధిత అధికారులు,గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# బోజడ్ల బ్రహ్మమ్మ మృతదేహానికి నివాళులర్పించిన నన్నూరి నర్సిరెడ్డి



**మధిర ప్రజా జ్యోతి** మున్సిపాలిటీ పరిధిలో 16వ వార్డ్ కౌన్సిలర్ వంకాయలపాటి నాగేశ్వరరావు సోదరి భోజట్ల బ్రహ్మమ్మ అనారోగ్యంతో మృతి చెందగా వారి మృతి దేహానికి తెలుగుదేశం పార్టీ జిల్లా కన్వీనర్ వాసిరెడ్డి రామనాథంతో కలిసి తెలుగుదేశం జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి నివాళులర్పించారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె పరిస్థితి క్షీణించడంతో కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఆమె మృతి పట్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, నాగేశ్వరరావు కి మరియు వారి కుటుంబ సభ్యులకు నర్సిరెడ్డి పలువురు ప్రగాఢ సానుభూతి తెలిపారు.టిడిపి మధిర టౌన్ అధ్యక్షులు మల్లాది హనుమంతరావు, టిడిపి రాష్ట్ర నా యకులు చేకూరి శేఖర్ బాబు, రావి కోటేశ్వరరావు,టిడిపి రాష్ట్ర నాయకులు దో మలు సామేలు, టిడిపి సీనియర్ నాయకులు యడవల్లి నాగభూషణం టిడిపి కౌన్సిలర్లు కౌన్సిలర్ ములకలపల్లి వినయ్, కౌన్సిలర్ రేవతి పాల్గొని నివాళులర్పించారు.

# గంగుల శ్రీనుకు ఘనంగా నివాళులు

**బోనకల్, జూలై 20(ప్రజా జ్యోతి ):** బోనకల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గంగుల గోపి తండ్రి గంగుల శ్రీను ఇటీవల అనారోగ్యంతో మరణించ గా సోమవారం ఆయన దశదిన కర్మకు బోనకల్ గ్రామ సర్పంచ్ బానోత్ జ్యోతి, ఉప సర్పంచ్ బానోతు కొండ హాజరై గంగుల శ్రీను చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ.. గంగుల శ్రీను మరణం వారి కుటుంబానికి తీరని లోటని అన్నారు. ఆయన సేవాభావం, అందరితో కలిసిమెలిసి ఉండే స్వభావం ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.నివాళులర్పించిన వారిలో గ్రామ పెద్దలు గుండపనేని సుధాకర్ రావు, తేళ్లూరి రమేష్, గంగుల పుల్లయ్య, మల్లెల యాలాద్రి, అంతోటి శ్రీను గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారు.



# వ్యవసాయానికి పరిశ్రమల తోడ్పాటుతోనే

# రైతుల ఆదాయం పెరుగుతుంది

(మొదటి పేజీ తరువాయి...)

ఆధారపడుతోందన్నారు.పాలేరు జలాశయం, నాగార్జునసాగర్ ఎడమ కాలువ, వైరా రిజర్వాయర్ ఈ ప్రాంత రైతాంగానికి జీవనాధారమని పేర్కొన్నారు.రైతుల ఆదాయం పెరగాలంటే సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్ పామ్ వంటి అధిక ఆదాయం ఇచ్చే వాణిజ్య పంటల సాగు వైపు మళ్లడం అవసరమన్నారు. ఈ అంశాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సమగ్రంగా వివరించారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు నాలుగు సంవత్సరాల కాలంలో ఎకరాకు సుమారు రూ. 52 వేల వరకు ప్రోత్సాహకాన్ని అందిస్తోందని తెలిపారు. సూపర్ ఎల్‌నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ ఆయిల్ పామ్ సాగు నిలకడైన దిగుబడిని అందిస్తుందని చెప్పారు.దేశంలో వంటనూనెల అవసరం ఎక్కువగా ఉన్నదని, దేశీయ ఉత్పత్తి 12 మిలియన్ టన్నులకు మాత్రమే పరిమితమైందన్నారు. ప్రతి సంవత్సరం సుమారు 3 మిలియన్ టన్నుల వంటనూనె దిగుమతుల కోసం రూ.1.5 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం వెచ్చించాల్సి వస్తోందని తెలిపారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ఆయిల్ పామ్ సాగు విస్తరణ అత్యంత అవసరమని స్పష్టం చేశారు.1991–92లో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హయాంలో ఈ ప్రాంతంలో ఆయిల్ పామ్ సాగుకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 15 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, దేశ అవసరాలకు అనుగుణంగా దానిని 70 లక్షల ఎకరాలకు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. 2023లో టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.12 వేలుగా ఉండగా ప్రస్తుతం సుమారు రూ.23 వేలకు చేరడం రైతులకు ప్రయోజనకరంగా మారిందన్నారు.వంట నూనెతో పాటు సౌందర్య సాధనాల పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాలను కూడా ఆయిల్ పామ్ ద్వారా అందించవచ్చని తెలిపారు.ఖమ్మం జిల్లాలో ఈ సమీకృత పరిశ్రమ ఏర్పాటవడం రైతులకు, యువతకు వరంగా నిలుస్తుందని పేర్కొంటూ, ఈ పరిశ్రమ ఏర్పాటుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిరంతరం కృషి చేశారని ప్రత్యేకంగా అభినందించారు. గోద్రెజ్ యాజమాన్యం, స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్, అధికారులు అందరికీ అభినందనలు తెలిపారు.ఈ పరిశ్రమకు అవసరమైన రహదారి మౌళిక సదుపాయాలను టీజీఐఐసీ ద్వారా త్వరలోనే కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లాలో మరిన్ని వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పడి రైతులు పండించే పంటలకు స్థానికంగానే





విలువ ఆధారిత ఉత్పత్తులు తయారయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు.దీని వల్ల రైతుల ఆదాయం పెరగడంతో పాటు స్థానిక యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.ఈ సమీకృత ప్రాజెక్టులో సీడ్ గార్డెన్, మిల్లింగ్ యూనిట్, రిఫైనరీ వంటి అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు కావడం విశేషమన్నారు.భవిష్యత్తులో ఆయిల్ పామ్ విత్తనాల కోసం ఇండోనేషియా, మలేషియా వంటి దేశాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదన్నారు. 113 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ సమీకృత పరిశ్రమ గంటకు 60 నుంచి 120 టన్నుల గెలలను ప్రాసెస్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉందని తెలిపారు.గోద్రెజ్ సంస్థ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, మిర్చి, పత్తి, వరి ఆధారిత పరిశ్రమలను కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని సంస్థను కోరారు.రైతులు వాణిజ్య పంటలు, విలువ ఆధారిత వ్యవసాయంపై దృష్టి సారించాలని పిలుపు నిచ్చారు.రాష్ట్ర స్థూల ఆర్థికోత్పత్తి (GSDP) సుమారు రూ.17 లక్షల కోట్లు ఉండగా,వ్యవసాయ రంగం వాటా కేవలం 15 శాతం మాత్రమే ఉండటం రైతుల ఆర్థిక పరిస్థితిని సూచిస్తోందన్నారు. రైతుల ఆదాయం పెరగాలంటే వాణిజ్య పంటలు, విలువ ఆధారిత పరిశ్రమలే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు. ఇటీవల తొమ్మిది రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సాయం జమ చేశామని తెలిపారు.నాగార్జునసాగర్, కృష్ణా జలాలు, సీతారామ ఎత్తిపోతల పథకం, పాలేరు లింక్, ఎన్మూరు–రాజీవ్ లింక్ కాలువల ద్వారా లభించే నీటిని వినియోగించుకొని ఖమ్మం జిల్లాలో ఉద్యాన పంటల సాగును మరింత విస్తరించాలని సూచించారు.కొణిజెర్ల మండలం భవిష్యత్తులో రాష్ట్రం లోనే ప్రముఖ పారిశ్రామిక మండలంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న సీడ్ గార్డెన్ ద్వారా దేశవ్యాప్తంగా రైతులకు నాణ్యమైన ఆయిల్ పామ్ విత్తనాలు అందించే స్థాయికి ఈ కేంద్రం ఎదగాలని అన్నారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలపై ప్రతి గ్రామంలో రైతులతో చర్చలు నిర్వహించి అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా గోద్రెజ్ సంస్థ ఆయిల్ పామ్ గెలల కొనుగోలు లో రైతులకు భాగస్వామిగా నిలుస్తోందని తెలిపారు. రాష్ట్రవిభజన అనంతరం తెలంగాణలో ఆయిల్ పామ్ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేసే అవకాశాలు మరింత విస్తరించాయని, దేశంలోనే ఆయిల్ పామ్ హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఒకప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లాకే పరిమితమైన ఆయిల్ పామ్ సాగు, నేడు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరించిందని తెలిపారు.ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, రానున్న 2 నుంచి 3 సంవత్సరాల్లో దానిని 10 లక్షల ఎకరాలకు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.దేశం వంటనూనెల్లో స్వయం సమృద్ధి సాధించాలంటే సుమారు 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు అవసరమని చెప్పారు.ప్రస్తుతం దేశంలోని ఆయిల్ పామ్ సాగులో దాదాపు 90 శాతం తెలుగు రాష్ట్రాల నుంచే జరుగుతోందన్నారు.తెలంగాణలో ఇప్పటి వరకు మూడు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు పనిచేస్తుండగా, గోద్రెజ్ ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమ నాలుగో ఫ్యాక్టరీ అని తెలిపారు.దేశంలో ఇప్పటి వరకు ఆయిల్ పామ్‌కు ప్రత్యేక సీడ్ గార్డెన్ లేకపోవడం గమనార్హమని, గోద్రెజ్ సంస్థ మలేషియా భాగస్వామ్యంతో ఖమ్మంలో దేశంలోనే తొలి ఆధునిక సీడ్ గార్డెన్‌ను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. సీడ్ గార్డెన్‌తో పాటు పరిశోధన కేంద్రం, రైతులకు అవగాహన కల్పించే ప్రదర్శన విభాగాలు, శిక్షణా కార్యక్రమాలు, నాణ్యమైన నర్సరీల ఏర్పాటు వంటి కార్యక్రమాలకు కూడా నేటి నుంచే శ్రీకారం చుడుతున్నామని తెలిపారు.ఈ సమీకృత ఆయిల్ పామ్ కేంద్రం రైతులకు అన్ని విధాలా ఉపయోగపడు తుందని మంత్రి పేర్కొన్నారు. రైతుల సందేహాల నివృత్తి, శాస్త్రీయ సాగుపై మార్గదర్శకాలు, నాణ్యమైన మొక్కలు,వ్యవసాయ పరికరాలు, ఎరువులు, పురుగు మందులు, అవసరమైన సాంకేతిక సేవలు ఒకే కేంద్రంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపడితే ఎకరాకు 15 నుంచి 16 టన్నుల వరకు ఆయిల్ పామ్ గెలల దిగుబడి సాధించవచ్చని చెప్పారు. రాష్ట్రంలో త్వరలోనే మరో ఆరు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.ప్రస్తుతం నెలకొన్న సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో పంటల వైవిధ్యీకరణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల దక్షిణ భారతదేశంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో ఆయిల్ పామ్, ఉద్యాన పంటలు రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందించే ఉత్తమ ప్రత్యామ్నాయమని వివరించారు.ఆయిల్ పామ్ రైతులు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నారని, ఆయిల్ పామ్ సాగు చేస్తున్న అనేక మంది రైతుల కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడి, వారిపిల్లలు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే స్థాయికి ఎదిగారని అన్నారు. ఇతర ఏ పంటతోనూ పోల్చలేనంత ఆదాయం ఆయిల్ పామ్ ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. తాను కూడా ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతునేనని గుర్తు చేశారు.వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించడం రాష్ట్ర ప్రభుత్వ విధానమని తెలిపారు. ఏ జిల్లాలోనైనా 10 వేల ఎకరాలకు పైగా ఆయిల్ పామ్ సాగు ఉంటే అక్కడే ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరను పెంచాలని, అలాగే దిగుమతులపై సుంకాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోందన్నారు.ఆయిల్ పామ్ తోటల్లో కంది, పత్తి, పప్పు ధాన్యాలు వంటి అంతర పంటలను విజయవంతంగా సాగు చేయవచ్చని చెప్పారు.తద్వారా రైతులకు ప్రారంభ సంవత్సరాల్లోనే అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు. ఖమ్మం జిల్లా దేశానికే స్ఫూర్తిగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి పరిశ్రమల ఏర్పాటు ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం,యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. గోద్రెజ్ సంస్థ మరో పరిశ్రమను కూడా ఖమ్మంలో ఏర్పాటు చేయాలనుకుంటే అవసరమైన భూమిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.ఆయిల్ పామ్ సాగు విస్తరణతో పాటు వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధే తెలంగాణ రైతుల ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తుందని, ఖమ్మం జిల్లా దేశంలోనే ఆయిల్ పామ్ రంగానికి ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు.వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేసిందని తెలిపారు. ఆ విజన్‌కు అనుగుణంగా వ్యవసాయ రంగ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ రూపొందించామని, ప్రస్తుతం సుమారు 40 బిలియన్ డాలర్లుగా ఉన్న వ్యవసాయ రంగ ఆర్థిక విలువను 2047 నాటికి 400 బిలియన్ డాలర్లకు పెంచడమే రాష్ట్రప్రభుత్వ లక్ష్యమని వివరించారు.రాష్ట్రంలో ప్రస్తుతం 3.36 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, గత మూడు సంవత్సరాల్లోనే 2 లక్షల ఎకరాల కొత్త విస్తీర్ణం ఆయిల్ పామ్ సాగులోకి రావడం దేశంలోనే అత్యధికమని తెలిపారు. గోద్రెజ్ సంస్థకు ఖమ్మం జిల్లాలో 113 ఎకరాల భూమిని కేటాయించి, అవసరమైన అన్ని అనుమతులను వేగవంతంగా మంజూరు చేయడం ద్వారా,రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో దేశంలోనే తొలి సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ను ఏర్పాటు చేయడం సాధ్యమైందన్నారు.గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్మెన్ నాదిర్ బి.గోద్రెజ్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.దేశం వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడం జాతీయ లక్ష్యమని,ఆ లక్ష్య సాధనలో తెలంగాణ ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందన్నారు.ఆయిల్ పామ్ సాగు విస్తరణలో మహిళలు మరింత చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రైతు కుటుంబాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగితే ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం మరింత పెరిగి, దేశం వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించే లక్ష్యం వేగంగా నెరవేరుతుందని పేర్కొన్నారు.గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్ కటారియా మాట్లాడుతూ★ గత మూడు దశాబ్దాలుగా గోద్రెజ్ సంస్థ దేశ వ్యాప్తంగా ఆయిల్ పామ్ రంగంలో పని చేస్తోందన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వేల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ, దేశంలోని ప్రముఖ ఆయిల్ పామ్ సంస్థల్లో ఒకటిగా గోద్రెజ్ ఎదిగిందని తెలిపారు. భారత్ ఇప్పటికీ వంటనూనెల అవసరాల కోసం విదేశీ దిగుమతులపై ఆధారపడుతోందని, దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు ఆయిల్ పామ్ సాగు విస్తరణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ దిశగా తెలంగాణ రాష్ట్రం దేశంలోనే వేగంగా ఎదుగుతున్న రాష్ట్రంగా నిలిచిందని కొనియాడారు.తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఖమ్మం జిల్లాలో తొలి సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇదే ప్రాంగణంలో త్వరలోనే ఎడిబుల్ ఆయిల్ రిఫైనరీని కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమీకృత ప్రాజెక్టు ద్వారా 700 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు.నాణ్యమైన ఆయిల్ పామ్ మొక్కల ఉత్పత్తి కోసం ఖమ్మంలోనే సీడ్ గార్డెన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులకు మెరుగైన నాణ్యత గల నాట్లను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఆయిల్ పామ్ సాగు మరింత విస్తరించేందుకు సంస్థ కృషి చేస్తుందని చెప్పారు.వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ అంజనాపురంలో సమీకృత ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు నాయకత్వంలో రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. గత 30 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని రైతులు కోరుకుంటూ వచ్చారని తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ప్రారంభమై, నేడు పూర్తై ప్రారంభోత్సవం జరగడం ఈ ప్రాంత ప్రజల కల సాకారమైన రోజుగా అభివర్ణించారు.గోద్రెజ్ సంస్థ ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ,ఫ్యాక్టరీలో ఉద్యోగాల భర్తీలో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ ప్రాంత యువత ప్రతిభావంతులు, నైపుణ్యం కలిగిన వారని, వారికి ఎక్కువగా ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, సుడా చైర్‌పర్సన్ దుర్గా ప్రసాద్ , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్,సర్పంచ్ లు, గోద్రెజ్ సంస్థ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అ ధికారులు,ఆయిల్ పామ్ రైతులు, పెద్ద సంఖ్యలో ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.